నిలయం
5292
శ్రీకాకుళం

# మనసు

"మృదులా!"

గదిలో అడుగు పెడుతూ భర్త పిలుపు విని ఆగిపోయింది.

రాఘవ హాల్లో సోఫాలో కూర్చొని ఏదో ఇంగ్లీషు మ్యాగజైను తిరగేస్తున్నాడు. అతని ముఖంలోని క్రోధ చిహ్నాన్ని గుర్తుపట్టటానికి ఆమెకు అట్టే టైము పట్టలేదు.

"ఎక్కడి కెళ్ళావ్?"

... ... ... ...

"మాట్లాడవేం?"

"కొత్తగా అడుగుతారేం! ఏం తెలియనట్లు! రోజూ ఎక్కడికి వెళుతున్నాను! మహిళామండలికి, లేదా లేడీస్ క్లబ్బుకు!" మృదువుగా నవ్వుతూ అంది.

"నీవస నాకేం నచ్చలేదు!"

... ... ...

"నువ్వు ఆ మహిళామండలి సెక్రెటరీ షిప్పుకి రాజీనామా ఇచ్చెయ్యాలి!"

"అలాగే!"

రాఘవ్‌కి ఏంమాట్లాడాలో తెలియలేదు. తను రాజీనామా ఇచ్చెయ్యమంటే ఎదిరిస్తుందేమో అనుకున్నాడు. కాని తను అనుకున్నట్టు జరగలేదు. "నేనివ్వను!" అని కుండబ్రద్దలుకొట్టినట్టు సమాధానం రావాలని ఆశించాడు. కాని మృదుల అలా మాట్లాడదు. ఎంతో నమ్రతగా తను అడిగిన ప్రతిమాటకూ "అలాగే" అంటుంది. అన్నిటికీ మంచిగానే సమాధానం చెప్తుంది. ఆ మెత్తని సమాధానాలతోనే తనను కొరుక్కుతింటోంది. తను చెప్పిన ప్రతిమాటనూ ఆమె మృదువుగా అంగీకరిస్తూవుంటే తనకు కాల్తున్న కొంపలో ఉడికిపోతునట్టుంటుంది.

"క్లబ్బుకి తిరగడం కొద్దిగా తగ్గించాలి!" ఎంతో కష్టంమీద కఠినత్వాన్ని గొంతులోకి తెచ్చుకున్నాడు.

"కొద్దిగా ఏంఖర్మ! పూర్తిగా మానేస్తా. సరేనా! ఇంకేమైనా చెప్పాల్సినవి ఉన్నాయా!"

సున్నితంగా మెల్లగా పారే సెలయేరులా నవ్వింది మృదుల.

తనకు తెలుసు. అలానవ్వటం ప్రపంచంలో ఒక్క మృదులకే సాధ్యమవుతుంది, క్రింది పెదవి కొంచెం ప్రక్కకు వంచి, తెల్లనిముత్యాల్లాంటి పలువరస కనీకనబడనీయకుండా, చూపుల్ని ప్రక్కనున్న ఏదో వస్తువుమీద కేంద్రీకరించి నుదుటిమీద సన్నటిరేఖల్ని పదిలపరుస్తూ, వినయాన్ని వ్యక్తపరచే సన్నటి శబ్దంతో మెల్లగానవ్వుతుంది మృదుల.

పెళ్ళయిన క్రొత్తలో, అంటే ఆమె కాలేజీలో ట్యూటర్‌గా చేరకముందు; తను సాయంత్రం ఆఫీసునుండి ఇంటికి వచ్చేసరికి స్వాగతంఇస్తూ సరిగ్గా ఇలాగే నవ్వేది. ఆనాటి రోజుల్లో తనహృదయంలో ఆ నవ్వుకు మల్లెలు పరిమళించేవి. ఆమె ఈనాటికీ ఆ నవ్వును మర్చిపోలేదు. కాని తను ఈనాడు ఆ నవ్వుకి ఇష్టపడలేకపోతున్నాడు. ఆమె అలానవ్వుతూవుంటే తనను అగాధంలోకి త్రోస్తున్నట్టు ఫీలింగ్ కలుగుతోంది. ఆ నవ్వు ఒక విధమైన అహాన్ని, గర్వాన్ని సూచించినట్టుంటుంది. ఎప్పుడైనా తనమాటకు ఎదురు తిరిగితే దులిపేద్దామనుకుంటాడు. కాని మృదుల ఏనాడూ అలాచెప్పదు. కనీసం మాట్లాడడంకూడా తక్కువే. తను ఎంతకోపాన్ని తెచ్చుకున్నా నిండుగానవ్వేసి ఆ కోపాన్ని మాపేస్తుంది.

రాఘవ్‌కి ఏమిచేయ్యాలో తోచటంలేదు. ఆమెకు సమాధానం చెప్పటానికి మాటలు దొరకటంలేదు. అసలు గ్రంథంలోకి ఏలాదిగాలో తోచటంలేదు. తను ఆరోజు విన్న విషయం ఇంకా మనసును పిండుతున్నట్టుంది. అంతకుముందే ఆవిషయాన్ని చూచాయగా తెలుసుకున్నా నమ్మలేకపోయాడు. ఒకళ్ళూ ఇద్దరూ అన్న ఆమాటల్ని విని అలాగే జాగ్రత్తపడితే విషయం ఇంతవరకూవచ్చి లోకుల నోళ్ళలో పడకుండా వుండేదేమో. కాని ఈ విషయం లోకులమధ్య వ్యాపించింది. చేతులు కాలాక ఆకులు పట్టుకునేవంతు అయింది.

మృదుల ఎమ్. ఎ. ప్యాసయింది. సభ్యత, సంస్కారం వున్న మనిషికదా అని ఆమెకు ఇవ్వగలిగినంత స్వేఛ్ఛను ఇచ్చాడు. కాని ఆస్వేచ్ఛను ఈవిధంగా దుర్వినియోగం చేస్తుందని మాత్రం కలలోకూడా అనుకోలేక పోయాడు. తాను ఆంధ్రాయూనివర్సిటీలో ఎమ్. ఎస్. సి. ఫైనల్ చదివే రోజుల్లో మృదుల ఎమ్. ఎ. లో చేరింది. ఆమె సంస్కార భావాలు, విశాలహృదయం అర్థంచేసుకొని ఇష్టపడి ఆమెను తను వివాహం చేసుకున్నాడు.ఆమెలో ఆకర్షణలేదు. కాని నిర్వచించలేని అందం ఉంది. బుగ్గలు సన్నగా సొట్టలు పడేలా నవ్వే ఆమె నవ్వులో ప్రత్యేకత వుంది. ముఖంలో ఆకర్షణ లేకపోయినా ఆచిన్న అందమైన నోరు పంచిఇచ్చే చిరునవ్వే ఎంతటి మనిషినయినా లొంగదీస్తున్నట్టనిపిస్తుంది:

వివాహమయిన ఏడాదివరకూ ఇద్దరిజీవితం నల్లేరుమీద బండిలా హాయిగా సాగిపోయింది. కాని, ఇంట్లో తోచడం లేదని మృదుల కాలేజీలో ట్యూటర్‌గా చేరింది. ఆనాడు ఆమెను తను అడ్డుపెట్టలేకపోయాడు. అందుకు మనసా అంగీకారాన్నికూడా తెలియబరచాడు. నిజానికి ఆమెకూడా డబ్బు ఆర్జించవలసిన అవసరం తనకులేదు. హాయిగా కూర్చొని తిన్నా తరగని ఆస్తి తండ్రి తనమీద వదలిపెట్టి పోయాడు. మృదుల కోరికను వమ్ముచేయటం ఇష్టంలేక తానే కష్టపడి ట్యూటర్ పోస్టు ఆమెకు సంపాదించాడు. ఆమె ఉద్యోగంలో చేరి ఇంకా ఎనిమిదినెలలయినా కాలేదు. ఈ లోగానే ఆమె

మహిళామండలి సెక్రటరీగా ఎన్నికకావటం, లేడీస్ క్లబ్బు మెంబరవటం మొదలైనవన్నీ జరిగిపోయాయి.

ఈ బాధ్యతలన్నీ నిర్వహించి ఆమె ఇంటికి వెళ్ళేసరికి రాత్రి తొమ్మిదిగంటలయిపోయేది. ఆఫీసునుంచి వచ్చేసరికి చల్లగా నాలుగు మాటలు చెప్పటానికి భార్య ప్రక్కన లేక పోవటం మాత్రం కొంచెం కష్టంగానేవుంది, ఈమధ్య రాఘవ్‌కు. ఉదయాన్నే లేచి కాఫీత్రాగి స్నానంచెయ్యటం, పదికాగానే భోజనంచేసి, ఆఫీసుకు వెళ్ళిపోవటం. సాయంత్రం మళ్ళీ ఐదుగంటలకు తిరిగివచ్చి ఏబీచ్‌కో వెళ్ళిపోవటం, రాత్రి వంటవాడి చేతిమెతుకులు తిని నడుం వాల్చటం,అంతా యాంత్రికంగా తయారయింది అతనిజీవితం. మునుపయితే తలదువ్వటందగ్గరనుంచీ బట్టలుతొడగడం, భోజనంచెయ్యటం వరకూ మృదుల సమక్షంలో ఎంతో హాయిగా జరిగిపోయేవి కాని ఇప్పుడు ఆమెపనులచే ఆమెకు తీరికలేదు. ఎప్పుడో ఏపదింటికో ఇంటికివచ్చి, తనకు సన్నగా నిద్రపడుతూవుంటే; భోజనంచేసి నిద్రకు ఉపక్రమిస్తుంది. తెల్లవారితే మళ్ళీ ఎవరి పనులువాళ్ళవి.

ఆమె ఉద్యోగంలో చేరిన క్రొత్తల్లోనే ఆ వార్త విన్నాడు. ఆమె బోటనీలెక్చరర్‌తో చాలా చనువుగా తిరుగు తుందని! కానీ చనువుగా తిరిగినంతలో తప్పేముందిలే! అని సర్దుకొని ఊరుకొనేవాడు. ఒకళ్ళిద్దరు తన దగ్గర వ్యంగ్యంగా మాట్లాడినా 'లోకులు కాకులు' అని పట్టించుకోలేదు. కాని

ఇప్పుడు ఆ కాకులు చేసే గోల భరించలేకపోతున్నాడు. ఒకళ్లూ ఇద్దరు, నలుగురూ కాదు! యిప్పుడు లోకులనే కాకులన్నీ తనని పొడుస్తున్నట్లు, క్రోళ్ళై కూస్తున్నట్లు అన్పిస్తుంది రాఘవ్‌కు.

అప్పుడే వారం రోజులనుంచీ మృదులను ఈవిషయమై అడుగుదా మనుకుంటున్నాడు. అనుకోవటమేకాదు. రెండు మూడు రోజుల క్రితం చూచాయగా ఇద్దరిమధ్యా దొర్లే సంభాషణలో ఈ విషయాన్ని వ్యక్తంచేశాడు. ఆమెమాత్రం ఆవగింజ అంతయినా తెలియనట్లు మొహం పెట్టి మాట్లాడింది. ఆమె పల్చని నవ్వుక్రింద బరువైన భావాలను అణగ త్రొక్కేస్తుంది ఈ వారం రోజులనుంచీ, ముఖ్యంగా అందుకే ఆమె నవ్వుని అంగీకరించలేక పోతున్నాడు. ఆమెపైన అసహ్యం, క్రోధం అనుమానం పెనవేసుకొని దట్టంగా పెరిగి పోతున్నాయ్.

ఈ రోజు తెగించి అడిగెయ్యాలనే పట్టుదలతో, ఆమె వచ్చేవరకూ హాల్లో మ్యాగజైను తిరగేస్తూ కూర్చున్నాడు. ఆమె వచ్చిన వెంటనే ఎంతో కఠినంగా ఆమెను ప్రశ్నించాలనుకున్నాడు. కాని ఆమె ముఖం చూడగానే ఆ కఠినత్వమంతా తనలోంచి తుడచి పెట్టుకుపోయింది.

తన క్రాప్ పరీక్షకు సమాధానంగా తాను నవ్వ గలిగిన నవ్వును ముఖం మీదకు తెచ్చేసుకుంది. ఇక తాను

లొంగిపోయే సమయం ఆసన్నమవుతోందని గ్రహించాడు రాఘవ. వెంటనే కోపంపాళ్ళని ఎక్కువ చేశాడు.

"ఏమైనా ఆడదానికి ఇంత అహం, గర్వం పనికిరావు. కట్టుబాటులో ప్రవర్తించటం, హద్దులు మీరకుండా తిరగటం నేర్చుకోవాలి" కంటి రెప్పలమీది స్వేద బిందువును గోటితో తుడుచుకున్నాడు.

మృదుల మౌనపడిపోయింది.

ఆమెపై ఈ ఆఖరి మాటలు బాగా పనిచేశాయి.

భర్త తనతో ఎప్పుడూ యింత కఠినంగా మాట్లాడలేదు.

ఈ మధ్యభర్త మరీ మారిపోయినట్టు అనిపిస్తోంది. అతనికి ఒంట్లో నలతగా ఉందేమో అని సరిపెట్టుకొంది మృదుల.

కాని ఈ రోజున అతని మాటలు వింటుంటేమనస్సులో ఎవరో కెలికినట్టయింది.

భర్తకు అంత కోపాన్ని కల్గించిన కారణమేమో ఆమెకు అంతుపట్టలేదు.

"ఏమిటండీ! అలా మాట్లాడతారూ! ఇప్పుడు నేను అంత హద్దుమీరే పనులు ఏం చేశాను? వారం రోజులనుంచీ గమనిస్తున్నా! మీరెందుకిలా మారిపోయారు? మీ మనస్సులో ఏమైనా ఉంటే చెప్పెయ్యకూడదూ! అలామనస్సులో పెట్టుకొని ఎందుకు కుమిలిపోతారు ? చెప్పదలచుకున్న

దేమిటో చెప్పేయ్యండి. కారణం లేకుండా ఇద్దరి మధ్యా అగాధాలు సృష్టిస్తున్నారు, అసలే మీ ఆరోగ్యం మంచిది కాదు. దానికితోడు ఈ అశాంతి. కోపం కూడానా! డాక్టరు వద్దకు ఒక్కసారి వెళ్ళకూడదూ! ఎన్నిసార్లు చెప్పినా నా మాట వినరేం!"

రాఘవ్ ఆ మాటల్ని వినలేకపోతున్నాడు.

ఆమె అలా మాట్లాడుతూవుంటే హాలు గోడలన్నీ దగ్గరగా వచ్చేసి తనని ఊపిరి సలపకుండా నలిపేస్తున్నట్టు అనిపించింది.

మెత్తని కత్తులతో హృదయాన్ని చీలుస్తున్నట్టుంది.

తను అడిగే ప్రశ్నలకు తెలివిగా నీతిని, ఆరోగ్యాన్ని తనకు బోధిస్తూ సమాధానాలు చెప్తోంది. యింకా అది చాలక ఆరోగ్య విషయాల్లో కుర్రాణ్ణి మందలించినట్లు జాగ్రత్తలు చెప్పటం కూడాను.

ఆమె మాటలు వింటూంటే గంగవెర్రులెత్తుతోంది రాఘవకు.

"ఎందుకింకా నంగనాచిలా మాట్లాడతావ్! ఇంకా ఎంతకాలం ఈ నటన సాగిస్తావ్! అంత ఇష్టంలేకపోతే నన్నెందు కట్టుకున్నావ్! ఆ బోటనీ ముసలాడ్నే చేసుకోలేకపోయావా" వ్యంగ్యంగా నవ్వాడు.

ఇంతకాలానికి తానుకూడా మృదులకంటె బాగా నవ్వినందుకు మనసులోనే గర్వించాడు.

మృదులకు క్షణంపాటు స్పృహ తప్పినట్లయింది.

ఇక అక్కడ నిల్చోటానికికూడా శక్తిలేక కాళ్ళీడ్చుకుంటూ గదిలోకి వెళ్ళిపోయింది.

ఎదురుదెబ్బ తగిలింది. ఆమె అక్కడినుండి వెళ్ళిపోవటంతో అభిమానం దెబ్బతింది. ఆమెలో ఏ తప్పూ లేనపుడు తనకు సమాధానం చెప్పటానికి ఎందుకు జంకాలి. అలా మౌనంగా వెళ్ళిపోవటంలో ఆమె ఉద్దేశ్యం ఏమిటి?... ఎంతైనా నిప్పులేకుండా పొగవస్తుందనుకోవటం అవివేకం. ఇన్ని రోజులు మెత్తమెత్తగా మాట్లాడి తనను మోసంచేసింది మృదుల. ఏమైనాసరే ఆ నిజాన్ని ఆమె నోటినుంచి కక్కించకుండా నిద్రపోకూడదనుకున్నాడు.

అనుమానంతో ఉడికిపోతున్న రాఘవకు ప్రక్కగదిలోంచి ఎక్కిళ్ళతో ఏడుస్తున్న శబ్దం స్పష్టంగా వినిపించింది.

ఆమె ఏడుపు వినపడటంతో అతనుచలించి పోయాడు.

వద్దనుకుంటున్నా వినకుండా కాళ్లు ఆమె ఉన్న గదిలోనికి ఈడ్చుకెళ్ళాయి.

హాల్లోవున్న మెర్క్యురీ బల్బుకాంతి పల్చగా గదిలోకి ప్రసరిస్తోంది.

గదిలో మంచంమీద బోర్లాపడి ఏడుస్తోంది మృదుల.

మంచం ప్రక్కనేవున్న కిటికీలోంచి విసురుగా వస్తున్న చల్లగాలికి ఆమె ముంగురులు ఎగిరిపడుతున్నాయి. ఆమె కట్టుకున్న పల్చని షిఫాన్ చీర రెపరెపలాడుతోంది.

మృదులను ఆ స్థితిలో చూచేసరికి రాఘవ్ కోపమంతా మంచులా కరిగి మాయమైపోయింది.

మాట్లాడటంలో కంగారుపడి ఆమె మనసుకు బాధకలిగించానా అనిపించింది అతనికి. నిజంగా ఆమెలో తప్పేమీ లేదేమో. ఆమెలో నిజంగా తప్పులేనపుడు తను పల్కిన మాటలు ఆమెను ఎంత కష్టపెడతాయో ఊహించటం కష్టమయింది.

వివాహమై సంసారంలో అడుగుపెట్టాక ఆమెలో ఏడుపుని చూడటం ఇదే మొదటిసారి. ఎంతబాధనయినా గుండెల్లో దాచుకుని రెండు కన్నీళ్ళతో మాత్రం మాలిన్యాన్ని తొలగించుకోగల్గిన మృదుల ఏడవటంచూస్తే అతనికి ఎంతో బాధ కల్గింది. ఎటూ తేల్చుకోలేని సంకట పరిస్థితి ఏర్పడిందతనికి.

ఆమెను ఆ స్థితిలో వదలి మాట్లాడకుండా గదిలోంచి బయటకు వెళ్ళిపోదామనుకున్నాడు. కాని అందుకు మనస్సు అంగీకరించలేదు.

దగ్గరగా వెళ్ళి ఏడుపు మాన్పటానికి ఆత్మగౌరవం అడ్డుతగిలింది.

రెండుక్షణాలపాటు ఆలోచనలో వుండిపోయాడు.

ఆ పరిస్థితిలో ఎవరో కర్తవ్యం బోధించి నట్లయింది.

"మృదులా" అన్నాడు తగ్గుస్వరంతో దగ్గరగా వెళ్తూ.

"........."

"మృదులా (అనవసరంగా మనస్సు కష్టపెట్టుకోకు! నలుగురూ నాలుగు విధాలుగా అంటూవుంటే విని మనసులో దాచుకోలేక అడిగాను. అప్పుడే వారంరోజులనుంచీ ఈ వార్తవింటున్నా అడగలేకపోయాను! ఇలాటి అనుమానాలు మనసులో వుంచుకుంటే అశాంతికి కారణమవుతున్నాయి.

ముద్దాయిలా తలవంచుకొనే అన్నాడు!

మృదుల ఒక్కసారి నీళ్ళునిండిన కళ్ళతో సూటిగా భర్త ముఖంలోకి చూసింది!

మెల్లిగా లేస్తూ చీర కుచ్చెళ్ళతో కళ్లు ఒత్తుకుంది.

"మరి ఈ వారంరోజులనుండీ నన్నా విషయం ఎందుకు అడగలేదు? లోకంలో నలుగురూ అంటూంటే వినటానికి ఒప్పుకున్న మీ మనస్సు ఆ మాత్రం నన్నడిగేందుకు ధైర్యం ఇవ్వలేదూ!"

రాఘవ మాట్లాడకుండా ఉండిపోయాడు! ఆ సమయంలో అడిగిన ప్రశ్నకు సరియైన సమాధానం దొరక్కపోవటమే మౌనానికి కారణం

"ఎవరో ముక్కూ, మొగం తెలియని మూర్ఖులు ఎవరో అన్నారనే ధ్యాసేగాని, నన్ను ఇంతగా అర్థంచేసుకున్న మీరు ఏమైనా ఆలోచించారా? ఈ నాలుగేళ్ళ సాంగత్యం లోనూ అంతేనా నన్ను తెలుసుకున్నది? ఆమాత్రం నామీద నమ్మకం లేకపోయినప్పుడు నన్నెందుకు చేసుకున్నారు? ఈలాటి మాటల్తో నన్ను బంధించటానికా? ఛీ! మీరుకూడా ఇంత నీచంగా ఊహిస్తారనుకోలేదు! సంఘంలో నలుగురితో చనువుగా తిరుగుతున్నప్పుడు అర్థంచేసుకొని సహించే ఓర్పు లేకపోతే, ఆనాడు నన్ను కాలేజీలో పోస్టుచేయించకుండా ఆ రోజునే నా కోరికకు అడ్డుచెప్పాల్సింది. అప్పుడేచేస్తే ఇంత బాధ పడవలసిన అవసరం లేకపోను. నన్నెందుకిలా చిత్ర హింస చేస్తారు! మీరెలా మాట్లాడినా ఎదురుచెప్పకుండా, అడ్డుపెట్టకుండా నడుచుకున్నందుకా ఈ శిక్ష! పాపం? ఆ ముసలాయన మీద అంతనింద వెయ్యటానికి మీ మనసెలా ఒప్పింది! ఆయన ఇక రెండు మూడు నెలతో రిటైరు కాబో తున్నారు! చిన్నతనంలో స్కూల్లో చదివేరోజుల్లో ఆయన మా ప్రక్క ఇంట్లో వుండేవారు? ఆయన పెద్దకూతురు, నేను కలిసి చదువుకున్నాం! ఆయన్ని "బాబాయ్" అంటూ పిల్చే దాన్ని. ఆ పరిచయంతో ఇప్పుడు చనువుగా తిరుగుతూవుంటే నలుగురూ అన్నారని మీరుకూడా ఇలా నీచంగా ఊహిస్తా

తనుకో లేదు. ఆయనకు ఈ సంగతి తెలిస్తే... పాపం ఆముసలి హృదయం ఎంత కృంగిపోతుంది!"

మాట్లాడ్డం ఆపి దీర్ఘంగా నిట్టూర్చింది మృదుల.

ఆమె మాట్లాడుతూ ఉంటే ఆమె ముఖంలోకి చూడ లేకపోయాడు రాఘవ.

అతనికి ముళ్ళమీద నించున్నట్లుంది.

ఆమె మాటలు అతని హృదయాన్ని చీల్చినట్లు న్నాయ్!

ఆమె చెప్పినది అంతా నిజమే అనిపించింది. ఇందా కటి పరిస్థితి తలచుకొంటే తనమీద తనకే అసహ్యం వేసింది.

"క్షమించు మృదులా! ఏమీ అనుకోకు! నీ మనసు తెలిసికూడా మొరటుగా ప్రవర్తించాను. లేచి భోజనం చెయ్యి!" అంటూ ఇక అక్కడ నిల్చోలేక నిష్క్రమించాడు.

భర్తవైపు చూచి వేడిగా నిట్టూర్చింది మృదుల.

*　　　*　　　*

కారుదిగి జోరుగా యింట్లోకి వచ్చాడు రాఘవ.

గదిలో మంచంమీదపడుకొని "పేకమేడలు" నవల చదువుతోంది మృదుల.

"మృదులా, ఈ రోజు కాలేజీకి సెలవు పెట్టేశావుట కదూ. నీకు లెక్చరర్‌గా ప్రమోషన్ వచ్చినట్లు ఇప్పుడే కాలే జీకి వార్తవచ్చింది. బోటనీ బాబాయ్ చెప్పారు."

"సరే, ఇప్పుడు ఆయన సంగతి ఎందుకులెద్దురూ! నేను ఇప్పుడే కాలేజీకి, మహిళామండలికి రాజీనామా లేఖలు పంపాను. క్లబ్బులో మెంబరుషిప్పు కూడా రద్దు చేయించాను మీరు శాంతిగా, హాయిగావుంటే నా కంతకంటె కావాల్సింది లేదు. మీరు బూటు విప్పుకోండి. ఒక్కనిమిషం. కాఫీ తీసుకొస్తాను" అంటూ వంటగదివైపు సాగిపోయింది మృదుల.

రాఘవ మాట్లాడకుండా ఆమెవైపే చూస్తూ వుండిపోయాడు.

★ ★ ★